సాక్షి అనకాపల్లి

మంగళవారం, 3, డిసెంబర్, 2024



సింహాచలం వరాహ పుష్కరిణిలో దీపాలు విడిచి పెడుతున్న భక్తులు

ఆధ్యాత్మిక సౌరభం





యలమంచిలిలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న కనకమహాలక్ష్మి అమ్మవారు (ఇన్‌సెట్) అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు







ఉపమాక పుష్కరిణి వద్ద దీపకాంతులు (ఇన్‌సెట్) ఉపమాక శివాలయానికి తరలివచ్చిన భక్తులు

కార్తీకానికి వీడ్కోలు.. మార్గశిర మాసానికి స్వాగతం పలుకుతూ.. జిల్లా అంతటా సోమవారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పోలిపాడ్యమిని పురస్కరించుకొని తెల్లవారుజామున నీటిలో దీపాలను వదిలి భక్తులు కార్తీక దామోదరుడికి పూజలు చేశారు. విశాఖలో సింహాచలేశుని పుష్కరిణి వద్ద, ఉపమాకలో వెంకన్న పుష్కరిణి వద్ద భక్తుల రద్దీ నెలకొంది. అరటి దొప్పెలలో దీపాలు వెలిగించి నీటిలో వదిలారు. మార్గశిర మాసం తొలిరోజు సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. యలమంచిలి మండలంలో మార్గశిర మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం వేకువజాము నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు 108 బిందెల నీటితో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అమ్మవారు కొలువైన గర్భాలయాన్ని పుష్పమాలలతో అలంకరించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ధూప, దీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. సంప్రదాయం ప్రకారం ప్రతి ఏడాదిలాగానే అమ్మవారికి దివంగత కొటారు రాంబాబు కుటుంబీకులు తొలి పూజలు చేశారు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఈ నెల 30వ తేదీ వరకు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు, హోమాలు చేస్తారని ఉత్సవ కమిటీ చైర్మన్ కొటారు సాంబ తెలిపారు.

–యలమంచిలి రూరల్/నక్కపల్లి

న్యూస్‌రీల్

హౌసింగ్ కాలనీల్లో తక్షణం నీటి సదుపాయం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ప్రభుత్వ హౌసింగ్ కాలనీల్లో తక్షణమే నీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ గృహ నిర్మాణ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయా శాఖలతో నిర్వహించిన సమీక్షలో హౌసింగ్ కాలనీలలో చేపడుతున్న మౌలిక సౌకర్యాలు, గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్, వ్యక్తిగత మరుగుదొడ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, నీటి సరఫరా వంటి నిర్మాణ పనుల పురోగతిని ఆమె తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో పని చేసి లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. నెలవారీ లక్ష్యాల సాధనలో ప్రతి వారం నిర్మాణ పనులు పురోగతి సాధించాలన్నారు. గృహ నిర్మాణ శాఖ పీడీ వై.శ్రీనివాస్, గ్రామీణ నీటి సరఫరా, జిల్లా ఇంజినీరింగ్ అధికారి ఎ.ఎస్.ఎ.రామస్వామి, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా దివ్యాంగుల ఆటల పోటీలు



దివ్యాంగులకు ట్రై సైకిల్ పోటీలు

అనకాపల్లి/తుమ్మపాల: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సోమవారం దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించింది. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. షాట్‌పుట్, రన్నింగ్, చెస్, క్యారమ్ పోటీల్లో సుమారు 100మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎల్.వి.రమణ మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం ఉదయం 10 గంటలకు గవరపాలెం వి.వి.రమణ రైతుభారతి కల్యాణ మండపంలో జరుగుతుందని చెప్పారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఈ సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్ బహుమతులు ప్రదానం చేస్తారని చెప్పారు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే డోలీ మోత కష్టాలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే గిరిజనులను డోలీ మోత కష్టాలు వెంటాడుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న విమర్శించారు. దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ శివారు గిరిజన గ్రామం బోడిగరువులో గర్భిణి సాహు శ్రావణి సోమవారం ఎదుర్కొన్న అవస్థలే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు గత ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసి మట్టి పనులు (ఎర్త్ వర్క్) పూర్తి చేసిందన్నారు. ఎన్నికల తర్వాత ఈ పనులు నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రోడ్డు గురించి కనీసం పట్టించుకోకపోవడంతో స్థానిక గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. చింతలపూడి పంచాయతీలో బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాలకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేసి, డోలీ మోతలను అరికట్టాలని సీపీఎం నేత వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతుల గుండెల్లో తుపాను

వరి పంట నేలకొరగడంతో తల్లడిల్లుతున్న అన్నదాత

తుమ్మపాల: తుపాను ప్రభావంతో జిల్లాలో వరుసగా మూడో రోజు సోమవారం కూడా చిరుగాలులతో కూడిన జల్లులు పడ్డాయి. పొలాల్లో నీరు చేరడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. కోతలు పూర్తిగా నిలిపివేసినప్పటికీ వెన్నుతో ఉన్న వరి వర్షానికి బరువెక్కి నేల వాలుతోంది. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో పొలాల్లో నీరు చేరడంతో రైతులు కాలువలు తీసి నీటిని దిగువకు మార్గం చేస్తున్నారు. సోమవారం అత్యధికంగా రాంబిల్లి మండలంలో 56 మి.మీ., అత్యల్పంగా రోలుగుంటలో 15.4 మి.మీ. వర్షం కురిసింది. జిల్లా మొత్తం 743.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

వర్షంతో తడిచిన వరి పనలు

తుపాను వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. బుచ్చెయ్యపేట, చీడికాడ మండలాల్లోని పలు గ్రామాల్లో పండిన వరి పంట కోత కోయకుండానే నేల వాలింది. కోసిన వరి పనలు తడిచి పోయి ధాన్యం మొలకెత్తుతున్నాయి. గత రెండు రోజులు కురిసిన వర్షంతో బుచ్చెయ్యపేట మండలం రాజాం, పెదమదీన, బుచ్చెయ్యపేట, గున్నెంపూడి, వడ్డాది, లూలూరు, కందిపూడి, నీలకంఠాపురం, ఆర్ భీమవరం, తురకలపూడి తదితర గ్రామాల్లో కోత కొచ్చిన వరి పంట నేల కొరిగింది. కోసిన వరి పంట కుప్పలు పెట్టకుండానే తడిచి పోయి ధాన్యం మొలకెత్తుతున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఆరు గాలం కష్టపడి పండించిన వరి పంట ఇంటికి చేర్చే సమయంలో అన్నదాతలకు కష్టాలు ఎదురయ్యాయి. రెండు రోజులుగా వరి పనలు తడిచిపోయాయని వర్షం తగ్గకపోతే ధాన్యం పూర్తిగా మొలకెత్తి తీవ్రంగా నష్టం వస్తోందని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు.



బుచ్చెయ్యపేట మండలం పెదమదీన వద్ద నేలకొరిగిన వరి పంట

పెద్దేరు జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం

మాడుగుల: పెద్దేరు జలాశయం నీటిమట్టం తుపాను కారణంగా పెరుగుతోంది. జలాశయం క్యాచ్‌మెంట్ ఏరియాలో 42 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదయింది. ప్రస్తుతం జలాశయంలోకి 70 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అంతే వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు రోజుల కిందట 131 మీటర్లున్న నీటిమట్టం ప్రస్తుతం 134 మీటర్లకు చేరుకుంది. దీంతో రబీ పంటలకు ఢోకా లేదని జలాశయం అధికారులు చెబుతున్నారు.

మండలాల వారీగా వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ.లలో)	మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
రాంబిల్లి	56.0	నాతవరం	36.3	మాడుగుల	28.4
ఎస్.రాయవరం	47.2	సబ్బవరం	34.9	మాకవరపాలెం	26.2
పాయకరావుపేట	45.8	కశింకోట	34.9	గొలుగొండ	25.5
యలమంచిలి	44.4	నర్సీపట్నం	33.6	చోడవరం	24.3
అచ్యుతాపురం	42.6	బుచ్చెయ్యపేట	33.6	మునగపాక	23.7
		రావికమతం	33.5	కోటవురట్ల	20.5
		నక్కపల్లి	32.9	అనకాపల్లి	19.3
		పరవాడ	31.9		

బోదిగల్లంలో పునరావాసం





నిర్వాసితులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

- ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల కోసం 121 ఎకరాల భూసేకరణ
- రైతులతో చర్చలు జరిపిన ఆర్డీవో
- ఎకరాకు రూ.30 లక్షల నష్టపరిహారం

నక్కపల్లి: విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ వారు భూసేకరణ జరిపిన గ్రామాల్లో నిర్వాసితులకు పెదబోదిగల్లం గ్రామంలో పునరావాసం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గ్రామంలో 121 ఎకరాల భూములు సేకరించి అక్కడ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. సోమవారం నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ బోదిగల్లం రైతులతో చర్చలు జరిపారు. వీసీఐఆర్ కోసం ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా చందనాడ, రాజయ్యపేట, అమలాపురం, వేంపాడు, డీఎల్‌పురం రెవెన్యూ పరిధిలో సుమారు 4500 ఎకరాల భూములను సేకరించిన విషయం తెలిసిందే. ఈ గ్రామాల్లో జిరాయితీ భూముల్లో ఇళ్ల నిర్మించుకున్నవారితోపాటు బుచ్చిరాజుపేట, పాటిమీద, మూలపర, బోయపాడు, చందనాడలో కొంత భాగం, తమ్మయ్యపేట, రాజయ్యపేటలో కొంతభాగంలో ఇళ్ల నిర్మించుకుని నివసిస్తున్న వారిని ఖాళీ చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2014లో టీడీపీ ప్రభుత్వంలోనే భూసేకరణ జరిగింది. భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం మాత్రమే చెల్లించారు. నిర్వాసితులకు మాత్రం పునరావాసం కల్పించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏపీఐఐసీ సేకరించిన భూములను ఇటీవలే ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా లిమిటెడ్ వారు రాజయ్యపేట సమీపంలో ఏర్పాటు చేయబోయే స్టీల్ ప్లాంట్‌కు కేటాయిస్తూ జీవో విడుదల చేశారు. ఇలా కేటాయించిన భూముల్లో నిర్వాసితులకు తక్షణమే పునరావాసం కల్పించాల్సి ఉంది. తమకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేసిన తర్వాతే భూములు స్వాధీనం చేసుకోవాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చింది. నిర్వాసితులందరికీ పెదబోదిగల్లం ముస్లిం గ్రామంలో పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టింది.

రైతులతో ఆర్డీవో చర్చలు

పెదబోదిగల్లంలో సేకరించనున్న భూముల యజమానులతో సోమవారం ఆర్డీవో చర్చలు జరిపారు. ఈ భూముల ధర మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.19.50 లక్షలు ఉంది. అయితే ప్రభుత్వం రైతులకు రూ.30 లక్షల వరకు నష్టపరిహారం చెల్లించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. ధర పెంచాలని రైతులు కోరినట్లు అధికారులు తెలిపారు. వారి డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, మరోసారి రైతులతో చర్చలు జరుపుతామని ఆర్డీవో తెలిపారు. ఇక్కడ సేకరించిన 121 ఎకరాల భూముల్లో సుమారు 1200 మందికి పైగా నిర్వాసితులకు పునరావాసం కల్పించే అవకాశం ఉంది. భూసేకరణ జరిగిన గ్రామాల్లో నిర్వాసితులెంతమంది ఉన్నారనేది ఇంకా లెక్క తేల్చాల్సి ఉంది. రైతులతో జరిగిన చర్చల్లో తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, స్థానిక సర్పంచ్ మున్నీశా పాల్గొన్నారు.

సేవ్ వాల్తేరు

విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో వాల్తేరు డివిజన్ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలను బట్టి చూస్తే డివిజన్ విభజన అనివార్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వైపు దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించగా.. మరోవైపు వాల్తేరు డివిజన్ నుంచి మేజర్ భాగాలను విడదీసి రాయగడ డివిజన్‌గా ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతున్నాయి. 130 ఏళ్ల చరిత్ర కలిగిన వాల్తేరు డివిజన్‌ను కాపాడాలన్న ప్రజల డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అందరిలోనూ ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- సాక్షి, విశాఖపట్నం

- కొత్త జోన్‌కి టెండర్ల నేపథ్యంలో వాల్తేరు డివిజన్‌పై నీలినీడలు
- రాయగడ, విజయవాడ డివిజన్లలో విలీనం చేయనున్న బోర్డు
- డివిజన్ కొనసాగింపును పట్టించుకోని కూటమి ప్రభుత్వం

వాల్తేరు డివిజన్ తూర్పు కోస్తా రైల్వేకు ప్రధాన ఆదాయ వనరు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీ మేరకు 2019 ఫిబ్రవరి 27న కేంద్ర ప్రభుత్వం విశాఖ కేంద్రంగా దక్షిణకోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో ప్రజలు ఆనందించినప్పటికీ.. కేంద్రం తీసుకున్న తదుపరి నిర్ణయంతో ఆ ఆనందం నీరుగారిపోయింది. వాల్తేర్ డివిజన్ ప్రధాన కేంద్రంగా రాయగడను ప్రకటించడం అందర్నీ నిరాశకు గురిచేసింది. వాల్తేరు డివిజన్‌ను రెండు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని విజయవాడ డివిజన్‌లోనూ, మరో భాగాన్ని కొత్తగా ఏర్పాటు చేయనున్న రాయగడ డివిజన్‌లో కలుపుతున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం 1,106 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న వాల్తేరు డివిజన్‌లో 541 చదరపు కిలోమీటర్ల భాగాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తున్న రాయగడ డివిజన్‌లో, మిగిలిన 565 చదరపు కిలోమీటర్ల భాగాన్ని విజయవాడ డివిజన్‌లో విలీనం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

పట్టించుకోని నేతలు



ఓవైపు జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి ఇటీవలే టెండర్లు ఆహ్వానించారు. టెండర్లు ఖరారు చేసిన రెండేళ్లలో కార్యాలయ నిర్మాణం పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఈ లోగా విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ జోన్ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. జోన్ డీపీఆర్‌లోనూ విశాఖ డివిజన్‌ని కొనసాగిస్తే మంచిదని కూడా సూచించారు. వాల్తేరు డివిజన్‌ని కొనసాగించాలంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఎంపీలు కూడా ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తారు. దీనిపై పునరాలోచిస్తామంటూ కేంద్రం డివిజన్ అంశాన్ని హోల్డ్‌లో పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాల్తేరు డివిజన్ విభజన అనివార్యమైనట్లు కనిపిస్తోంది. ఎందుకంటే ప్రస్తుత ఎంపీలు ఈ విషయంలో ఎలాంటి చొరవ చూపడం లేదు. ఎంపీలు ఒత్తిడి తెస్తే వాల్తేరు డివిజన్ కొనసాగే అవకాశం ఉన్నా.. వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం గమనార్హం. వారి తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.



వాల్తేరే కీలకం

తూర్పుకోస్తా రైల్వే జోన్‌కు వాల్తేరు డివిజన్ బంగారు బాతుగుడ్డు లాంటిది. జోన్‌లో పరిధిలో అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే డివిజన్ ఇదే. ఏటా మూడున్నర కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్ సరకు రవాణా, ఇతరత్రా ఆదాయం ఏటా దాదాపు రూ.15 వేల కోట్లు కాగా.. ఇందులో రూ.7 వేల కోట్లు వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. సాధారణ టికెట్ల ద్వారా రోజుకు రూ.25 లక్షల ఆదాయం లభిస్తోంది. ఇది భువనేశ్వర్ (రూ.12–14 లక్షలు) కంటే ఎక్కువ. దేశంలోనే సుమారు 300 డీజిల్ ఇంజన్లు ఉన్న అతిపెద్ద లోకోషెడ్, 160 ఇంజన్ ఉండే భారీ ఎలక్ట్రికల్ లోకోషెడ్, విశాలమైన మార్షలింగ్ యార్డు కూడా ఇక్కడే ఉన్నాయి. తూర్పు కోస్తాలోనే ఎక్కువ ప్యాసింజర్, సరకు రవాణా వ్యాగన్ ట్రాఫిక్ కలిగిన డివిజన్‌గా వాల్తేరు నిలుస్తోంది. ఐరెన్ ఓర్ రవాణా జరిగే కేకే లైన్ వంటి ప్రధాన మార్గాల ద్వారా వాల్తేరు డివిజన్‌కు అధిక ఆదాయం వస్తుంది. వాల్తేరు డివిజన్‌ను విభజిస్తే.. ఈ ఆదాయం రాయగడ డివిజన్‌కు సొంతమవుతుంది. అంటే విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే కొత్త తన సింహభాగం ఆదాయాన్ని కోల్పోనుంది.

వాల్తేరు డివిజన్ కొనసాగించాల్సిందే...



ఎంతో చరిత్ర ఉన్న వాల్తేరు డివిజన్‌ను విడదీయాలనుకోవడం సరి కాదు. ఈ డివిజన్‌కు దేశ రైల్వే చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు రాజీలేని పోరాటం చేయాలి. జోన్ ఎంత సెంటిమెంటో.. డివిజన్ కూడా ఉత్తరాంధ్ర ప్రజలకు అంతే సెంటిమెంట్. యూనియన్లు, వివిధ ప్రజాసంఘాలు కలిసికట్టుగా పోరాటం చేస్తే.. ప్రజలంతా మద్దతునిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

– ఎస్.ఈశ్వరరావు, రైలు ఫ్యాన్ అసోసియేషన్ ప్రతినిధి

క్లుప్తంగా

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ, ఉపాధి

తుమ్మపాల: ప్రధాన మంత్రి కౌసల్ యోజన 4.0 కింద నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అర్హతతో 15 నుంచి 45 ఏళ్ల వయస్సు లోపు ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు మాకవరపాలెంలోని నేక్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ కాలంలో ఉచిత స్టేషనరీ అందిస్తామని, శిక్షణ నాన్-రెసిడెన్సియల్ పద్ధతిలో ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు సెక్టారులో ఉపాధి కల్పిస్తామని తెలిపారు.

బీసీ కుల ధ్రువీకరణకు పంచనామా అవసరం లేదు

- దేవరాపల్లి తహసీల్దార్ స్పష్టీకరణ



తహసీల్దార్ లక్ష్మీదేవి

దేవరాపల్లి: కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఎటువంటి కొత్త నిబంధనలు లేవని, పాత పద్ధతిలోనే మంజూరు చేస్తున్నామని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి స్పష్టం చేశారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీకి పంచనామా, సర్పంచ్, స్థానిక అధికార పార్టీ నాయకుల సంతకాలు తప్పనిసరిగా ఉండాలని రెవెన్యూ అధికారులు చెప్పడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆమె స్పందించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బీసీల కుల ధ్రువీకరణ పత్రాలకు పంచనామా అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారికి తప్పనిసరిగా పంచనామా అవసరమని, పంచనామాకు గ్రామంలో ఎవరైనా ఐదుగురు పెద్దలు సంతకాలు పెడితే సరిపోతుందన్నారు. గ్రామ సర్పంచ్‌లు, నాయకులు మాత్రమే సంతకాలు పెట్టాలన్న నిబంధన లేదన్నారు. మండలంలో ఏ గ్రామంలోనైనా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో సమస్యలు తలెత్తినా, వీఆర్వోలు ఇతర రెవెన్యూ సిబ్బంది ఇబ్బందులకు గురి చేసినా తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ లక్ష్మీదేవి మండల ప్రజలకు సూచించారు.

పలు రైళ్లు దారి మళ్లింపు



తాటిచెట్లపాలెం(విశాఖ): దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు భద్రతా పనుల నిమిత్తం ఆయా తేదీల్లో పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- ఈనెల 2,4,6,7,9,11,13,14వ తేదీల్లో ధన్‌బాద్–అలప్పుజ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్, ఈనెల 4, 11వ తేదీల్లో జసిద్ది–తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్, 7, 14వ తేదీల్లో హతియా–ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్, 6, 13వ తేదీల్లో టాటానగర్–ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్, 9న హతియా– ఎర్నాకుళం (22837) ఏసీ ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించబడిన మార్గంలో వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయి. ఈ రైళ్లు ఆయా తేదీల్లో ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా ప్రయాణించవు.

కలెక్టరేట్‌కు అర్జీల వెల్లువ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి, జిల్లా అధికారులు

- పీజీఆర్ఎస్‌లో 231 అర్జీల స్వీకరణ
- త్వరితగతిన సమస్యలకు పరిష్కారం: కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిలువుటద్దంలా కలెక్టరేట్‌కు అర్జీలు వెల్లువెత్తాయి. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 231 అర్జీలు నమోదయ్యాయి. మరోవైపు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజా, విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసనలతో కలెక్టరేట్ హోరెత్తింది.

పీజీఆర్ఎస్ అర్జీలకు మూడు రోజుల్లో పరిష్కారం

పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన అర్జీలకు మూడు రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమెతో పాటు జేసీ జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, బీజేఆర్‌యూఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమామణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలు అందజేసిన అర్జీల పరిష్కారం గురించి సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. అర్జీలపై శాఖల వారీగా సమీక్ష చేసి, పరిష్కారంపై జిల్లా అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు చేశారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. పరిష్కారం కాని సమస్యలను ఎండార్స్‌మెంట్ చేయాలని, ఆ వివరాలను అర్జీదారునికి నేరుగా తెలియజేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి పడేలా వివరంగా తెలియజేసి, అర్జీలు రీఓపెన్ కాకుండా, పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారులకు కలెక్టర్ సూచించారు.

'ఠాగూర్'ప్రమాద మృతులకు కోటి పరిహారం చెల్లించాలి

పరవాడ ఫార్మాసిటీలో ఠాగూర్ లేబొరేటరీస్ కంపెనీ ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి, మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని ఫార్మా స్టాఫ్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విషవాయువు లీకై 32 మంది అస్వస్థతకు గురయ్యారని, వారిలో ఇద్దరు చనిపోయారని చెప్పారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించి, అస్వస్థతకు గురైన వారికి మెరుగైన చికిత్స, ఆర్థిక సహాయం చేయాలన్నారు. ఇటీవల జరిగిన ఎసైన్సియా ప్రమాదంలో మృతులకు రూ. కోటి పరిహారం, క్షతగాత్రులకు సుమారు రూ.25 లక్షలు అందజేసిన ప్రభుత్వం.. ఠాగూర్ పరిశ్రమ ఘటనలో మృతులకు రూ.40లక్షలు మాత్రమే ప్రకటించడం దారుణమన్నారు. ఠాగూర్ పరిశ్రమలో ప్రమాదం యాజమాన్యం నిర్లక్ష్యమేనని ప్రాథమిక రిపోర్టులో నిర్ధారణ అయినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఫార్మా వ్యర్థాలతో ఉప్పుటేరులో చేపల మృతి

అచ్యుతాపురం: స్థానిక సెజ్ పరిధిలోని ఫార్మా కంపెనీల్లో రసాయన నీటిని శుద్ధి చేయకుండా కాలువల్లోకి వదిలేయడంతో ఉప్పుటేరులోని చేపలు మృత్యువాత పడుతున్నాయని పూడిమడకకు చెందిన వాసుపల్లి శ్రీనివాసరావు కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. లాలం కోడూరు పక్కన ఉన్న కాలువ ద్వారా ఈ రసాయన వ్యర్థాల నీరు నేరుగా ఉప్పుటేరులో కలవడం వల్ల చేపలు మృత్యువాత పడుతున్నాయన్నారు. గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఎవ్వరూ స్పందించలేదని ఆయన ఆరోపించారు. తక్షణమే దర్యాప్తు చేపట్టి చేపల మృతికి కారణమైన కంపెనీలపై చర్యలు తీసుకుని, మత్స్యకారుల్ని ఆదుకోవాలని ఆయన కోరారు.



చేపల మృతిపై కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌కు ఫిర్యాదు చేస్తున్న పూడిమడక వాసులు

ఉచిత సీట్లకు ఫీజుల వసూలుపై ఆందోళన



ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు ఫీజులు వసూలుపై ఎస్ఎఫ్ఐ నిరసన

ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేదల పిల్లలకు ఉచితంగా కేటాయించిన సీట్లకు పలు కార్పొరేట్ స్కూళ్లు వసూలు చేసిన ఫీజులను తిరిగి తక్షణమే తల్లిదండ్రులకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద తల్లిదండ్రులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆర్టీఈ 12(1) చట్టం ప్రకారం నిరుపేదలకు ప్రైవేటు పాఠశాలల్లో కేటాయించిన సీట్లను ఉచితంగా ఇచ్చి ఇప్పుడు ఫీజులు కట్టించుకోవడం దారుణమన్నారు. ఇది పిల్లల భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని, అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరారు.

ఫ్లైఓవర్ నిర్మాణంలో పరిహారంపై స్పష్టత ఇవ్వాలి



రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంలో నష్టపరిహారం స్పష్టతపై బాధితుల ఆందోళన

అనకాపల్లి మండలం కొత్తూరు నరసింగరావుపేట నుంచి రాజుపాలెం రోడ్డుకు రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంలో భూసేకరణ విషయంలో బాధితులకు నష్ట పరిహారంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రాజుపాలెం సర్వే నంబర్ 62/3లో భవనాలు, స్థలాలతో పాటు రైల్వే వంతెన నిర్మాణం కారణంగా స్థానిక ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. గతంలో చేపట్టిన సర్వే ఆధారంగా మార్కింగ్ చేస్తున్నారని, స్థానిక రైతులకు, ప్రజలకు కనీస సమాచారం లేదన్నారు. గతంలో చేసిన వినతులకు కనీసం పట్టించుకోలేదన్నారు. ఇల్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులకు నష్ట పరిహారంపై స్పష్టత ఇచ్చి తమ డిమాండ్‌లను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

ఎస్పీ కార్యాలయానికి 34 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) 34 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ ఎస్పీ తుహిన్ సిన్హా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందాయన్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్పీ మనీషారెడ్డి, అదనపు ఎస్పీ ఎల్.మోహన్ రావు, ఎస్ఐ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బదిలీలు పూర్తయ్యేదెన్నడు?

- మైదానాన్ని వీడనివారు కొందరు..
- ఏజెన్సీలోనే మగ్గిపోతున్నవారు మరికొందరు..
- నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని కోరుతున్న బాధితులు

అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీసుల బదిలీల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆ శాఖ సిబ్బంది కోరుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఆగస్టు 19వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పోలీసుల బదిలీలు ముగిశాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో మాత్రం అరకొరగా జరిగి నిలిచిపోయాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మూడు సంవత్సరాలకు మించి అక్కడ పనిచేస్తున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులను వారి వారి సర్వీసులను బట్టి ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఉద్యోగులను మైదాన ప్రాంత పోలీస్‌స్టేషన్లకు తీసుకురావాలని కోరుతున్నారు. అధికారుల అండదండలతో, రాజకీయ నేతల పలుకుబడితో మైదాన ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లలో 5 నుంచి 8 సంవత్సరాలకు పైబడి విధులు నిర్వహిస్తున్నవారున్నారు. ఏజెన్సీ ప్రాంతానికి బదిలీపై వెళ్లి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా రాజకీయ పలుకుబడి లేకపోవడంతో కొంతమంది సిబ్బంది ఏజెన్సీలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది జూన్ మాసంలో ఏజెన్సీలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందిని దిగువ ప్రాంతాలకు బదిలీ చేసి.. మైదాన ప్రాంతంలో ఉన్న పోలీసులను ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేయాల్సి ఉంది. అయినప్పటికీ నేటి వరకూ జిల్లా పోలీస్ అధికారుల్లో చలనం లేదని ఏజెన్సీ పోలీస్ శాఖలో గుసగుసలు మొదలయ్యాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనకాపల్లి జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో 5 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన సిబ్బందిని తక్షణమే ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేయాలని ఆ శాఖ సిబ్బందే కోరుతున్నారు. అనకాపల్లి జిల్లాకు చెందిన సుమారు 65మంది పోలీసులు ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారు.

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం

- జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి లూసీ కార్డిలియా
- ఇరువాడ విలేజ్ హెల్త్ క్లినిక్ తనిఖీ



ఇరువాడ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలపై ఆరా తీస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

అచ్యుతాపురం: మాతా శిశు మరణాల నివారణ లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని అనకాపల్లి జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ లూసీకార్డిలియా ఆదేశించారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని ఇరువాడ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందుతున్న వైద్య సేవల్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. క్లినిక్ పరిధిలోని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లూసీకార్డిలియా మాట్లాడుతూ రక్తహీనత సమస్య లేకుండా చూసుకోవాలని, జిల్లాలో ఎక్కడ రక్తహీనతతో మరణాలు సంభవించకూడదని సూచించారు. గ్రామ స్థాయిలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, దోమల నివారణకు చర్యలు తీసుకుంటే వ్యాధుల వ్యాప్తి ఉండదని పేర్కొన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని కోరారు. జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, డీపీవో జగదీశ్, ఐడీఎస్‌పీ కోఆర్డినేటర్ జనార్దన్, వైద్యాధికారి మానస, ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తజన కల్పవల్లి.. కనకమహాలక్ష్మి

- మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం



అమ్మవారికి నేరుగా పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్(విశాఖ) : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, సిరులు కురిపించే చల్లనితల్లి బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. ఉదయం 8.40 గంటలకు అమ్మవారి ఉత్సవాలను స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించి ప్రత్యేక పూజలు జరిపారు. తొలి రోజు పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మార్గశిరం తొలిపూజలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సీపీ ప్రత్యేక పూజలు

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ సంప్రదాయ ప్రకారం ఈవో కె.శోభారాణి పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

ప్రతి రోజూ అన్నదానం

మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకొని నెల రోజులపాటు అన్నదానం నిర్వహించనున్నారు. తొలిరోజున టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రతి రోజూ 2 వేల మందికి, ఉత్సవాలు చివరి రోజున 20 వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టనున్నారు.

నమో నారసింహ

- ఘనంగా 41 రోజుల శ్రీ నృసింహ దీక్షలు ప్రారంభం
- సుమారు వెయ్యి మందికి శాస్త్రోక్తంగా మాలధారణ
- 12 నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభం
- జనవరి 12న దీక్షా విరమణ



దీక్ష స్వీకరణకు హాజరైన దీక్షాధారులు(ఇన్‌సెట్) వేదికపై అప్పన్నస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



తులసి మాలలను వేదిక వద్దకు తీసుకొస్తున్న అర్చకులు, అధికారులు, దీక్షాధారులు

సింహాచలం : శ్రీనృసింహ దీక్షలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 41 రోజుల మండల దీక్ష తీసుకునేందుకు సింహగిరికి వచ్చిన సుమారు వెయ్యి మంది దీక్షాధారులకు ఉదయం 8 గంటలకు దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా మాలధారణ చేశారు. ఆలయ రాజగోపురం పక్కన మాడవీధిలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటుచేసి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రతిమని ఉంచారు. దేవస్థానం అర్చకులు, అధికారులు ఆలయంలోంచి తులసి మాలలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామి చెంతన తులసిమాలలను ఉంచి అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారి అష్టోత్తర శతనామావళిని దీక్షాధారులందరిచేత పఠింపజేశారు. అనంతర దీక్షాధారులకు మాలధారణ చేశారు. స్వామివారి తులసి మాల, దీక్ష నియమావళి పుస్తకాలను అందజేశారు. స్వామి దర్శనాన్ని ఉచితంగా కల్పించారు. అన్నప్రసాద భవనంలో దీక్షధారులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అందజేశారు. దీక్ష తీసుకున్నవారిలో సింహాచలం ప్రాంతానికి చెందిన చందన పెరుమాళ్ పీఠంకి చెందిన భక్తులు, సింహాద్రి మఠంకి చెందిన భక్తులు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజనులు, ఒడిశాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఉన్నారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చందన పెరుమాళ్ల పీఠం గురుస్వామి సానబోయిన రాజు, సింహాద్రి మఠం గురుస్వామి కె.సురేంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా ఈనెల 12 నుంచి 32 రోజుల శ్రీ నృసింహ దీక్షలు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. జనవరి 12వ తేదీన దీక్షావిరమణ, శాంతి కల్యాణం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి కేసులో నిందితుడికి రిమాండ్

అనకాపల్లి: గతేడాది ఆగస్టులో జాతీయ రహదారిపై 280 కేజీల గంజాయిని పట్టుకున్న కేసులో ఆరో నిందితుడు రోలుగుంట మండలం వెన్నగోపాలపురం గ్రామానికి చెందిన ఆర్.రాంబాబును స్థానిక నెహ్రూచౌక్‌లో సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు రాంబాబుపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.

ఇగ్నో వార్షిక పరీక్షలు ప్రారంభం

ఎంవీపీకాలనీ(విశాఖ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో 6 కేంద్రాల్లో పరీక్షలు సోమవారం ప్రారంభమైనట్లు కేంద్రం సంచాలకుడు డాక్టర్ ధర్మారావు తెలిపారు. 4 వేల మంది విద్యార్థులు ఆయా కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇగ్నో వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా ఉషోదయ కూడలిలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు 'ఉన్నతి'




ఉన్నతి పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- 100 రోజుల 'ఉపాధి' పని దినాలు పూర్తి చేసిన వారికి ప్రోత్సాహం

తుమ్మపాల: జాతీయ ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాల్లో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో దయానిధి, జిల్లా అధికారులతో కలిసి ఆమె 'ఉన్నతి' పథకం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నతి పథకం ద్వారా 2018 నుంచి 2024 వరకు ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పనిని పూర్తి చేసిన కుటుంబాల నుంచి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతితోపాటు 100 రోజుల కూలి రేటు ప్రకారం స్కాలర్‌షిప్ చెల్లిస్తామన్నారు. 75 శాతం హాజరు దాటిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌తో పాటుగా శిక్షణ అనంతరం ప్రముఖ బహుళ జాతి కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమామణి, డ్వామా పీడీ బి.పూర్ణిమదేవి, స్కిల్ డెవలప్‌మెంటు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



యలమంచిలి రూరల్: యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16వ నంబరు జాతీయ రహదారిపై షేక్‌పాలెం కూడలికి సమీపంలో సోమవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం ఢీకొని ఓగుర్తు తెలియని వ్యక్తి(50) దుర్మరణం చెందాడు. అనకాపల్లి నుంచి తుని వైపు నడిచి వస్తున్న పాదచారుడిని వెనక నుంచి స్కూటీతో వస్తున్న యలమంచిలి పట్టణానికి చెందిన కందికొండ శ్రీను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు అంబులెన్సులో ఇద్దర్నీ యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం రెండు గంటల తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. స్కూటీ నడుపుతున్న శ్రీను తల, ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. ఆయనను మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని అనకాపల్లి మార్చురీకి తరలించి భద్రపరిచినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. ఈ ప్రమాదంపై కొక్కిరాపల్లి వీఆర్వో పల్లా గంగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

ఎంవీపీకాలనీ(విశాఖ): 71వ రాష్ట్ర స్థాయి సీనియర్ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాదరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరగనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌నకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. పురుషుల జట్టుకు మేనేజర్‌గా పి.బాలకృష్ణ, కోచ్‌గా పి.చైతన్య, కెప్టెన్‌గా ఎస్.తేజ వ్యవహరించనుండగా యు.శివ, ఎస్.చిన్నంనాయుడు, పి.ప్రసాద్, ఆర్.రూపేష్, ఎస్.గోవర్ధన్, కె.జై, బి.సందీప్‌కుమార్, జి.అజయ్, ఎస్.పవన్, సహిద్ మున్నా, పి.నూకరాజు సభ్యులుగా ఎంపికైనట్లు తెలిపారు. మహిళల జట్టుకు మేనేజర్‌గా ఎస్.పోలయ్య, కోచ్‌గా కె.లక్ష్మణరావు, కెప్టెన్‌గా పి.అంజలి వ్యవహరించనుండగా పి.యమున, పి.దివ్య, కె.సంధ్య, పి.ద్రాక్షాయణి, ఐ.మేఘన, వై.కోమలి,పి.మౌనిక, ఈ.కల్యాణి, వై.హారిక, హెచ్.ప్రవళిక, పి.బాలకృష్ణ ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన పురుషుల జట్టుకు ఏయూ ఇండోర్ స్టేడియంలోను, మహిళల జట్టుకు గాజువాక కబడ్డీ గ్రౌండ్‌లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మార్గశిర మాస పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు చిదంబరం

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, మాజీ అధ్యక్షుడు దాడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది నియామకంలో ప్రభుత్వ విఫలం

అనకాపల్లి: జోనల్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడంతో కూటమి ప్రభుత్వం విఫలమైందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జోన్ పరిధిలో పన్నులు వసూలు చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ సిబ్బంది నియామకంలో చూపించాలన్నారు. ప్రధానంగా జోనల్ కార్యాలయంలో హెల్త్ అధికారి, ఫుడ్ ఇన్‌స్పెక్టరు, టౌన్ ప్లానింగ్ అధికారి, ఇంజినీరింగ్ అధికారులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులతోనే కాలం గడుపుతున్నారని ఆరోపించారు. పట్టణ పరిధిలో పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, గోతులను పూడ్చాలని కోరారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని పెదనరవ ప్రాంతంలో అనారోగ్యానికి గురైన ఓ గుర్తు తెలియని మహిళ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నరవ ప్రాంతంలో రెండు రోజుల క్రితం అపస్మారక స్థితిలో ఉన్న మహిళ(50)ను స్థానికుల సమాచారంతో పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. సమాచారం తెలిసిన వారు 94407 96039, 99081 66714 నంబర్లలో సంప్రదించాల్సిందిగా సీఐ కోరారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 1,512 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,550
మొదటి రకం	3,180	4,100
రెండో రకం	3,120	3,700
మూడోరకం	2,590	3,100

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డీసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

కలవరింత



వెంకుపాలెంలో వరికుప్పలు వేస్తున్న రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

- కోత దశలో వరి పంట
- నేలరాలుతున్న గింజలు
- తుఫాన్ ప్రభావంతో ఆందోళన

అనకాపల్లి: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే వరి పంట పండి కోత దశకు చేరుకుంది. దాన్ని కోత కోసి కళ్లాలకు చేర్చుకునే అవకాశం లేక దిగాలు చెందుతున్నారు. అక్కడక్కడ పొలాల్లోనే గింజ నేల రాలుతుండటంతో ఉసూరుమంటూ నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల చిరుజల్లులు సైతం పడుతుండటంతో మరింత కలవరం చెందుతున్నారు. పంట తడిచి గింజ ఎక్కడ మొలకెత్తుతోందోనని భయాందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో పంటను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

పట్టణంతోపాటు మండలంలో 6,823 ఎకరాలకుగాను గతేడాది సుమారుగా 5,300 ఎకరాల్లో వరి పంట పండింది. ఈ ఏడాది 6,138 ఎకరాల్లో వరి పంట వేశారు. సుమారుగా 800 ఎకరాల్లో వరి బాగా పండింది. వరి పండించే సమయంలో సకాలంలో వర్షాలు కురవడం, తుఫాన్‌లు కారణంగా మొదటిలో కొద్దిపాటి ఇబ్బందులు పడినప్పటికీ చివరిదశలో రైతు శ్రమకు వరి బాగా పండింది. ఈ నెల 15వ తేదీకి కల్లా వరి పంట పూర్తిగా కోసివేసి, ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం 700 ఎకరాల్లో వరిపంటను కోసి కుప్పలు వేశారు. కొంతమంది రైతులు తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకుని కోతలు కోయలేదు. ప్రకృతి కరుణించినట్లయితే వరికోత ముమ్మరం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వరి పంట పూర్తయిన వెంటనే పొలాల తడిని బట్టి మినుములు, పెసలు, జనుము, నువ్వులు, కూరగాయలు పండించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



తుమ్మపాలలో కోత దశలో వరిపంట

అవరాలతోపాటు కూరగాయల సాగుకు ప్రణాళికలు...

- మండలంతోపాటు పట్టణ పరిధిలో మినుములు 70 ఎకరాలలోను, పెసలు 60 ఎకరాలలోను, నువ్వు 600 నుంచి 800 ఎకరాలలోను, జనుము 240 నుంచి 280 ఎకరాలలోను ఈ నెల 20వ తేదీ నుంచి పండించేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు.
- మండలంలో ఊడేరు, సీతానగరం, గోపాలపురం, తగరంపూడి, అక్కిరెడ్డిపాలెం, అల్లిఖానుడువానిపాలెం గ్రామాల్లో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు పండించగా, పట్టణ పరిధిలో సాత్-2 అవఖండం భూముల్లో సుమారుగా 140 నుంచి 160 ఎకరాల్లో టమాటా పంటలను వేసేందుకు సిద్ధంగా ఉన్నారు.
- మినుములు, పెసలు, నువ్వులు, జనుము విత్తనాలు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలోను, రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి.
- ఆకుకూరలు, కూరగాయలకు కావలసిన విత్తనాలు, పంటలను నాశనం చేసేందుకు సిద్ధంగా ఉన్న పురుగులకు క్రిమిసంహారక మందులు రైతు సేవా కేంద్రాల్లో ఉన్నాయి.

రైతులను ఆదుకోవాలి



నేను ఈ ఏడాది రెండెకరాల్లో వరి పండించాను. పంట చేతి కందొచ్చిన సమయంలో తుఫాన్ ముప్పు వల్ల మాకు నిద్ర లేకుండా పోతోంది. పూర్తిగా తుఫాన్ ప్రభావం తగ్గిపోయినట్లయితే నాకు ఇబ్బంది లేదు. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

– వేగి వెంకట కన్నప్పారావు, తుమ్మపాల, అనకాపల్లి మండలం

రైతులకు గిట్టుబాటు కావడం లేదు

పట్టణంలో అవఖండం భూమిలో అరెకరంలో వరిపంట వేసాను. వరి కోత పూర్తయిన వెంటనే టమాటా పంట వేస్తాను. కొద్దిపాటి ఆకుకూరలు పండిస్తున్నాను. పంటలు పండించే రైతులకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ఎస్.లక్ష్మి, అక్కిరెడ్డిపాలెం, అనకాపల్లి మండలం

వాతావరణం అనుకూలించాక కోయాలి



మండలంలో రైతులు ఎక్కువగా వరి వేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం పెరిగింది. రెండు, మూడు రోజుల్లో తుఫాన్ బలహీనపడి వాతావరణం అనుకూలించాక రైతులు వరి పంటను కోసి భద్రపరుచుకోవాలి. మినుములు, పెసలు, నువ్వులు, జనుము సాగుకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. భూమి పదును చూసుకుని వేసుకోవాలి.

– పి.రంగాచారి, మండల వ్యవసాయాధికారి, అనకాపల్లి

క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలి

గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ఉపాధ్యక్షుడు కోన లక్ష్మణ డిమాండ్



జోనల్ కమిషనర్ రమణకు వినతిపత్రం అందజేస్తున్న కోన లక్ష్మణ్

అనకాపల్లి: జోనల్ పరిధిలో క్లాప్ డ్రైవర్లకు ప్రభుత్వ జీవో ప్రకారం నెలకు రూ.21 వేల వేతనం ఇవ్వాలని గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ఉపాధ్యక్షుడు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జోనల్ కార్యాలయంలో ఇన్‌చార్జి జోనల్ అధికారి బి.వి.రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోన లక్ష్మణ మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులకు ఈ ఏడాదికి సంబంధించి సరెండర్ లీవు మంజూరుపై సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఇంక్రిమెంట్లు, ఏరియర్స్ తక్షణమే చెల్లించాలన్నారు. జీవో నంబరు 212ను సవరించి 168 మంది యంటీఎస్ కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలన్నారు. క్లాప్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా నాయకులు సతీష్, కోన దుర్గా, ఈశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లకు, ఈఎస్ఐ, పీఎఫ్‌లు చెల్లించాలని, ఆటో లోడర్స్ జీతాలు రెగ్యులర్‌గా పీఎఫ్, ఈఎస్ఐతో కలిపి చెల్లించాలని కోరారు. ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలన్నారు. కోర్టు కేసులు సత్వరమే పరిష్కార నిమిత్తం అధికారులు, కార్మిక సంఘాలతో ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. యూనియన్ నాయకులు నిమ్మకాయల నర్సింహమూర్తి, బంగారి రవికుమార్, యర్రంశెట్టి అప్పలరాజు, సింగంపల్లి అజయ్, యర్రంశెట్టి సుమన్, క్లాప్ డ్రైవర్లు సంతోష్, గంగరాజు, నాయుడు, కిరణ్, శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై భారం

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం దశలు వారీగా విద్యుత్ చార్జీలు పెంచుతూ సామాన్య ప్రజలపై పెనుభారం మోపుతుందని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ విమర్శించారు. స్థానిక నెహ్రూచౌక్ సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ పాలకులు చాపకింద నీరులా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. విద్యుత్ చార్జీలు పెంపునకు స్మార్ట్ మీటర్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇప్పటికే ట్రూఅప్ చార్జీల పేరుతో సామాన్యుల నడ్డి విరిచారన్నారు. స్మార్ట్ మీటర్లతో మరింత భారం పడే అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం తక్షణమే విద్యుత్ చార్జీలు తగ్గించాలని, లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు



పరవాడపాలెం కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లను పరిశీలిస్తున్న సీఐ స్వామినాయుడు

కశింకోట: పరవాడపాలెం గ్రామ కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాల నివారణకు పోలీసులు సోమవారం చర్యలు చేపట్టారు. పరవాడపాలెం నుంచి జాతీయ రహదారికి చేరే సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు వేగంగా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ పి.మనోజ్‌కుమార్‌ల ప్రోత్సాహంతో సర్పంచ్ బలిజ మంగ, మండల మాజీ ఉపాధ్యక్షుడు ఉగ్గిన రమణమూర్తి, గొంతిన గంగాధర్ తదితర గ్రామ నాయకుల సహకారంతో వాహనాల వేగం నియంత్రణకు సిమెంట్, కాంక్రీట్‌తో స్పీడ్ బ్రేకర్లు వేశారు. మిగిలిన గ్రామాల్లోనూ స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు స్థానికుల సహకారంతో చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి



అనకాపల్లి: వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



అనకాపల్లి: కూరగాయల మార్కెట్ వద్ద సాధువుల గుడిలో శివలింగానికి క్షీరాభిషేకం..



అనకాపల్లి: శారదానది ఒడ్డున అన్నసమారాధన చేస్తున్న కమిటీ సభ్యులు



అనకాపల్లి: శారదానది ఒడ్డున అన్నసమారాధనలో భక్తులు



కశింకోట: శారదానది ఒడ్డున భక్తుల దీపారాధన

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- దీపాల వెలుగుల్లో శారదానది కళకళ
- ముగిసిన కార్తీక మాసం

దీపాల వెలుగులతో శారదా నదీ తీరం కళకళలాడింది. కార్తీక మాసం ముగింపు సందర్భంగా పోలి పాడ్యమి పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున భక్తులు పోలిని స్వర్గానికి పంపారు. నదీ స్నానమాచరించి ఆవు నేతిలో ముంచిన వత్తులను అరటిదొప్పలలో పెట్టి వెలిగించి నదిలో విడిచిపెట్టారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

అనకాపల్లి: స్థానిక శారదా నదీ తీరం భక్తులతో సందడిగా మారింది. పోలి పాడ్యమి పురస్కరించుకుని సోమవారం వేకువజాము 3 గంటల నుంచి సూర్యోదయం వరకు దీపారాధనతో కళకళలాడింది. స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి, మెయిన్‌రోడ్డు సిద్ధిలింగేశ్వరస్వామి, గవరపాలెం భోగలింగేశ్వరస్వామి, కూరగాయల మార్కెట్ వద్ద సాధువుల గుడి, గాంధీనగరం, శారదానది ఒడ్డున ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు శివలింగాలకు క్షీరాభిషేకం చేశారు. భక్తులు బ్రాహ్మణులకు స్వయంపాకం దానం చేశారు. శారదానది ఉమారామలింగేశ్వరస్వామి, గవరపాలెం భోగలింగేశ్వర స్వామి ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

శారదా నదీ తీరంలో భక్తుల సందడి..

కశింకోట: స్థానిక శారదా నదీ తీరం భక్తులతో సందడిగా మారింది. పోలి పాడ్యమి పురస్కరించుకుని సోమవారం వేకువజాము 3 గంటల నుంచి సూర్యోదయం వరకు దీపారాధనతో కళకళలాడింది. కార్తీక మాసం ముగిసిన తర్వాత వచ్చే పోలి పాడ్యమి రోజు సూర్యోదయానికి ముందు స్నానాలు ఆచరించి దీపారాధన, పూజలు, దానాలు చేస్తే శుభప్రదమని, పుణ్యం వస్తుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో పోలి పాడ్యమి పురస్కరించుకొని స్థానికులతోపాటు పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి నదిలో సంప్రదాయంగా స్నానాలు ఆచరించి పురోహితులకు, బ్రాహ్మణులకు పండ్లు, వస్త్రాలు, బియ్యం, కొబ్బరి బొండాలు, ఉసిరి దీపాలు, సాలగ్రామం వగైరా దానం చేశారు. వారి ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం అక్కడి వేంకటేశ్వర స్వామి, సింహాద్రి అప్పన్నస్వామి, దుర్గాదేవి, రామాలయం, ఉమాశంకర ఆలయాలను దర్శించి అరటి దొప్పలపై నెయ్యి దీపాలు పెట్టి పూజలు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వర ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, అర్చకుడు సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అదేవిధంగా కార్తీక మాసం పురస్కరించుకొని స్థానిక గవరపేట, డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, వెలంపేట తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన గౌరీపరమేశ్వరుల విగ్రహాలను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. శివాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయం, లక్ష్మీనృసింహస్వామి ఆలయాలను ఎక్కువగా దర్శించి పూజలు నిర్వహించారు. దీంతో ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల గ్రామాల్లోని పలు శైవాలయాల్లో పోలి పాడ్యమి పూజలు నిర్వహించారు.



కశింకోట శివాలయంలో నిర్వహిస్తున్న అభిషేకాలు



అనకాపల్లి: సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు



అనకాపల్లి: వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పంతులకు దానం చేస్తున్న భక్తులు



కశింకోట: సింహాద్రి అప్పన్నస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కశింకోట: ఉమా శంకర ఆలయంలో భక్తుల సామూహిక పూజలు



కశింకోట: మహిళల దీపారాధన



కశింకోట: వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళల పూజలు

మొబైల్ వైద్య సేవల్ని వినియోగించుకోండి

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తున్న మెరుగైన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ డి.ప్రశాంత్ ప్రణీత్‌కుమార్ తెలిపారు. వెన్నలపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అవగాహనతోనే ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చన్నారు. ఎన్టీపీసీ సహకారంతో హెల్పేజ్ ఇండియా ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా మండలంలోని 29 గ్రామాల ప్రజలకు మొబైల్ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మొబైల్ హెల్త్ కేర్ యూనిట్ ద్వారా సింహాద్రి ఎన్టీపీసీ పరిసర గ్రామాల ప్రజలకు ప్రతి వారం బీపీ, మధుమేహం, కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్, థైరాయిడ్, చర్మ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. మంచం పట్టిన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమంలో వెన్నలపాలెం ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, మాజీ ఎంపీటీసీ పైల సన్యాసిరావు, పి.వి.నరసింగరావు, వెన్నల ఈశ్వరరావు, బి.నాయుడు, పి.ప్రసాద్ పాల్గొన్నారు.



వెన్నలపాలెంలో మొబైల్ వైద్య సేవల్లో ఎన్టీపీసీ ప్రతినిధులు

ప్రమాదకరంగా కొప్పాక -ఏలేరు కాలువ బ్రిడ్జి

మరమ్మతులు చేపట్టాలని బీఎస్పీ ధర్నా



గోతులు వద్ద ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాక వద్ద గాజువాక-అనకాపల్లి జాతీయ రహదారిలో ఏలేరు - కొప్పాక బ్రిడ్జి మరమ్మతులు చేపట్టి వాహనదారుల ప్రాణాలను కాపాడాలని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ గోతుల వద్ద పార్టీ నేతలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు మాసాలుగా ఏలేరు కాలువపై రోడ్డు గోతులతో ప్రమాదాలకు నిలయంగా మారిందని వాపోయారు. జాతీయ రహదారిపై ప్రయాణికులు నిత్యం భయంభయంగా ప్రయాణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు కొల్లి చిన్నప్పారావు, కట్టమూరి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.